# ఉచ్ఛనీచాలు

చిత్రాంగి అని అంటేతప్ప ఆమెను గురించి ఎవ్వరికీ తెలియదు. అసలు ఆమె పేరు ఎవ్వరో తెలియదు. చిత్రాంగిని 'ఆమె' అని ఎవ్వరూ ఉపయోగించరు. సాధారణంగా, మోటగా 'అది' అనే అంటారు అంతా! ఆమె అంత లోకువ. అయితే, ఆమెకు చిత్రాంగి అని ఎవ్వరు పేరు పెట్టారోగాని ఆమెకు ఆపేరు నచ్చింది. అనుకుంటాను.

చిత్రాంగి ఏఒక్కనిదీకాదు. అందరిదీను.కాదు. చిత్రాంగి యజమాని డబ్బు. డబ్బు నీదగ్గరఉంటే చిత్రాంగి నీదగ్గిర ఉంటుంది. ఎంత వరకూ ఉంటుందంటే, నీదగ్గరున్న డబ్బుకున్న విలువ చచ్చే దాకా! చిత్రాంగిని, డబ్బును, రేఖాపటంగాచిత్రించ వచ్చు.

చిత్రాంగిని గురించి మామూలుగా అందరిలాగే నేనూ పొరబడ్డాను. చిత్రాంగికి వ్యక్తిత్వం లేదు. చిత్రాంగి చిత్రాంగిదే కాదు. మరిఎవ్వరిది? నీది. నాది. అతనిది కూడా! చిత్రాంగికి ఒక అభిప్రాయం లేదు. ఒక ఆలోచనలేదు. ఆమె ఇష్టాయిష్టాలతో పనిలేదు. కావాలంటే, ఈ వేళ ఆమెను నీస్వంతం చేసుకోవచ్చు. అయితే ఆమె యజమాని నీదగ్గరున్నాడా?

కాని నేను పొర పడ్డాను! చిత్రాంగి ఒరవడి తప్పింది. అంటె నమ్మదు ప్రపంచం. ఒకటి లెక్క.. జారుడు బండమీద నుంచి ఎవ్వడూ పడకుండా బయటకు రాలేడని.

నేను ఒకరాత్రి మామూలుగా హోటలునుంచి భోజనం చేసి వస్తూ, నాన్న వ్రాసిన వాక్యాలు మననం చేసుకొని, ఎందుకో బాధ పడినట్లు, అవస్థ పడ్డాను. నాన్న వ్రాసే ఉత్తరంలో ఏమీ కొత్త విశేషమేమీలేదు. మామూలుగానే వ్రాసాడు. "బాగా చదువు నాన్నా! పరీక్ష ప్యాసుకావాలి. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి గనక. పెరుగు ఏర్పాటు చేసుకో. చెల్లికి ఆయినాపురం సంబంధం కుదరలేదు.." ప్రతీ ఉత్తరంలోనూ ఇదే వ్రాస్తాడు. అయితే.. ఈ వాక్యాలే, మూకథను రేఖా మాత్రంగా చిత్రిస్తుంది. నన్నునాగురించి ఆలోచించుకుంటే నేను బాధపడతాను నిజంగా! నన్ను గురించి నేను ఆలోచించుకోవాలని ఉండదు.

కిళ్ళీ కొట్టు సింహాచలం, ఏదో చిత్రాంగితో ఛలోక్తి విసిరాడనుకుంటాను. పకపకమన్నాడు. చిత్రాంగి ఎప్పుడూ అక్కడే ఉంటుంది.ఎప్పుడూ అక్కడే ఉన్నా, అక్కడ ఉంటున్నట్లు నాకు అనిపించదు. నేను ఎప్పుడూ అనుకోలేదుకూడా నాకు ఆ తలంపేరాదు.

సింహాచలం మంచివాడు అని నన్ను నమ్మించాడు.మర్యాదగా మాట్లాడతాడు. మర్యాద తప్పిన వారితో, తనుకూడా తప్పినట్లుంటాడు.

కిళ్ళీ కొట్టు దగ్గర ఆగాను..

"కుజానా ఎక్కువవేసి మిఠాయి కిళ్ళీ !" అన్నాను.

"అలాగేనండీ!.. ఉక్కదంచుతోందండీ! మీ మేడ బాగుంటుంది పంతులుగారు."

"అవును" అన్నాను.

"నాకు కూడా!" అంది చిత్రాంగి.

చిత్రాంగిని చూసాను. తెల్లచీరలో తెల్లగా ప్రకాశిస్తోంది. కొంగునురగలు కక్కే సముద్రపాయలావంకరులు తిరిగింది. చిత్రాంగినిచూస్తూ "బాగుంటుంది!" అనుకున్నాను. ఇంక అనుకున్నాను.." సమాజం అంతా, నీచేతుల్లో ఉండడానికి కారణం నీ అందం!"

సింహాచలం ఆమెను చూసాడు వింతగా,'ఏం కథ' 'అన్నట్లు' ఆచూపుల అర్థం ఆమెకుతెలుసు. నవ్వింది. ఆనవ్వు నవ్వుకాదు, చిన్న హాసం. ఆహాసంలో మయమరుస్తారు ఎవ్వరయినాసరే. అట్టి శక్తి ఆమెకు గలదు.

"ఏం అలా చూస్తావ్. నాకు కూడా కు జానా ఎక్కువ వేసి మిఠాయి కిళ్ళీ!" అంది ఆమె. నాకు ఆమె నచ్చింది. కాని ఆమె మొహాటతనానికి నేను భరించలేక పోయాను! మాటల్లో సున్నితంలేదు. కర్కశంగా, కటువుగా, కిరకిర చప్పుడు చేసినట్లు మాట్లాడుతుంది.

నన్ను చూసి నవ్వాడు సింహాచలం. "చూడండి సార్" అన్నట్లుచూసాడు. సింహాచలంలో కూడా నాజూకు లేదు. అతను మాట్లాడేటప్పుడు..ఎదర పెద్ద చిన్నలనే వివక్షత చేసి మాట్లాడ్డు. కాని అతని హృదయం నిదానమైనది! సింహాచలంలో నాజూకు లేకపోవడం. ఆమె మాట్లాడే తీరు.... వారిద్దరిదీ తప్పుకాదు. మనకు.. కొన్ని అవలక్షణాల, వికారాలు, సాంగత్యం వల్ల సంక్రమిస్తుంది. అది మనల్ని విడిచిపోదు.

"ఈవేళ కుజానా కావలసి వచ్చిందేమో!" అన్నాడు ఆమె శరీరవంపులకేసి చూస్తూ! రోజూ రాత్రి పదిగంటలదాకా చిత్రాంగి అక్కడే ఉంటుంది. అయినా, సింహాచలం 'కొత్త సరకు''ను చూపినట్లు చూస్తాడు.

నాకు కిళ్ళీ ఇష్టం పోదామనిపించింది. నేను గంటల తరబడి నుంచున్న దినాలు లేక పోలేదు. నాకు ఈభావన, ఈవేళ నిజంగా ఎందుకు కలిగింది?నాలో ఎందుకు కలవరం? ఏదో తప్పుచేస్తున్నట్లు, పిరికిపిరికిగా చూసే నా చూపులే సాక్ష్యం! నాకు ఏదో భయంగా ఉంది!

"ఈవేళ.... ఎందుకో వేసుకోవాలని ఉంది''. నన్ను చూస్తూ అంది. నన్ను చూస్తూ చిరునవ్వు చిలికింది కూడా! చిత్రాంగిని చూస్తూ లోపల ఏదో మధురంగా ఫూహించాను. నా శరీరం ప్రతీ అణువు వణుకుతున్నట్లు, కాలు జారి పడుతున్నట్లు, నాకాళ్ళు పట్టుతప్పిపైకి పోతున్నట్లు అనుకున్నాను.

"నన్ను పంపించు" అన్నాను, బలవంతంగా చిత్రాంగిని మనస్సులో నుంచి తొలగించాలని ప్రయత్నిస్తున్నాను. నునుపుతేరినఆమె చెక్కిళ్ళు, విశాలమైన ఫాలభాగం, వెన్నెలలను కురిపించే, ఆమెహాసం, నానుండి వేరుకాకపోవడంతో తత్తరపడ్డాను.

సింహాచలం ఓరగా నావైపు చూస్తూ నవ్వాడు! ఆనవ్వు నన్ను బ్రద్దలు చేసింది! నామంచితనానికి స్వఛ్ఛానికి మసిపూసింది! నేను భయంగా, "అలాంటిదేమీకాదు సింహాచలం! నన్ను నమ్మవూ!" అన్నట్లు సింహాచలాన్ని చూసాను. అతనికర్థం కాదు.

కిళ్ళీ ఇచ్చాడు. వేసుకొని వచ్చాను మేడపైకు. మేడకు ఎదురుగానే కిళ్ళీకొట్టు. మేడమీదనుంచి చూస్తే సింహాచలం కిళ్ళీకొట్టు ప్రతి అంగుళం కూడా కనపడుతుంది!

గదిలో రామం చదువుకుంటున్నాడు. రామాన్ని చూసి గతుక్కుమన్నాను. నాన్నవ్రాసిన ఉత్తరంలోని వాక్యాలు గుర్తుకు వచ్చాయి. వెంటనే వళ్ళు జలదరించింది. నాలో నేను అనుకొన్నాను. "లేదు నాన్నా జాగ్రత్తగానే చదువుతున్నాను!"


వెంటనే పుస్తకం తెరచి చదవడానికి ప్రయత్నించాను. పుస్తకంలోని ప్రతీ వాక్యమూ చదువుతోంటే అర్థంచేసుకొనే నాబుర్ర ఆశక్తిని కోల్పోయింది! వెంటనే చిత్రాంగి బొమ్మ! పుస్తకం తెరచే ఉంది. మనస్సు వేరొకచోట......

లేచి నుంచున్నాను. ఎదురుగా చిత్రాంగి, ఎందుకో నోట్లో గుడ్డకుక్కుకుని కిలకిల మంటోంది. నన్ను నేను సంబాళించుకోలేకపోయాను.ఏదో వింత అనుభూతిని పొందుతున్నాను. ఒకమారు తిరిగి కొట్టుదగ్గరకు వెళ్ళి చిత్రాంగిని చూడబుద్ధి పుట్టింది. కాదు అనుకొన్నాను. చూడాలనే కోర్కె బలంగా పనిచేసింది. కాని ఇప్పుడేకదా! ఇప్పుడు తిరిగి ఏమంటూవెళ్ళను!

తిరిగి పుస్తకం దగ్గర కూర్చున్నాను. కళ్ళు వాక్యాలను కదిలిస్తున్నవి. బుర్ర వేరొకచోటఉంది. బుద్ధిగడ్డిమేస్తోంది!

ఎనిమిది అయ్యింది. నాబుర్ర వేడెక్కింది. రామం చదువుకుంటున్నాడు. రామంతో అన్నాను..

వల్లూరి కృష్ణారావు



తిరుచునాపల్లి కోట

ఎస్.వి.ఆర్.స్వామి

ఈవేళ చదవలేను. పడుకుంటాను. నువ్వు పడుకోబోయేముందు నన్ను లేపు. చదువు కుంటాను.''

వాడు మాట్లాడక సరేనన్నట్లు బుర్రవూపి చదువు ధోరణిలో పడ్డాడు. రామం ఎప్పుడూ చదువురంధి తప్పితే మరోటిలేదు. నన్ను పలుక రిస్తే, ఏదైనా చెప్పి, వాడి కొంపముంచుతానని భయం! వాడి భయానికి, చదువురంధికి. నేను నవ్వుకున్నాను. వాడి రూమ్‌మేట్‌గా నన్ను ఎన్నుకొన్నాడంటే నామంచి తనానికి బుద్ధిమంత తనానికి యోగ్యతా పత్రమే! సందేహం లేదు!

మడతమంచం వాల్చి పక్కసిద్ధం చేసుకున్నాను. పడుకోబోయేముందు ఒకసారి చిత్రాంగిని చూసి పడుకొంటే! వెంటనే చొక్కా తగిలించుకొని క్రిందకు దిగాను. చిత్రాంగి ఇంకా అక్కడే ఉన్నది.ఆమె మల్లెపొదలా మధుర వాసనలను చిమ్ముతోంది! నేను చలించాను. ఏదో భావన నన్ను గిలిగింతలు పెట్టింది.

నన్ను చూసి సింహాచలం నవ్వాడు!

చిత్రాంగి నవ్వింది!

ఆనవ్వుల మధ్య నలిగిపోయాను నేను. ఎప్పుడూ నన్ను చూసి నవ్వేవాడు సింహాచలం! కాని ఇదివర కటినవ్వుకు ఇప్పటి నవ్వుకు తేడా వుంది! నాలోనూ తేడా కనపడతోంది అతడికి అని నేను అనుకోలేదు.

''సోడా ఒకటివ్వు!'' అన్నాను. ఆమె కళ్ళను చూశాను ఆమెకళ్ళలో మలినం నాకు కనపడలేదు. ఏదో ప్రబలమైన శక్తి ఆమెలో దాగి ఉన్నదని నేను అప్పుడు అనుకొన్నాను!

సోడాకొట్టి ఇచ్చాడు. త్రాగాను. తిరిగి మరొక సారి చూసింది నన్ను. నాపని అయిపోయింది. ఇంక నేను అక్కడ నుంచోకూడదు. తిరిగి వచ్చాను అసంతృప్తిగా!

మేడమెట్లు ఎక్కుతూంటే ''బాగా చదువు నాన్నా!''అన్ననాన్న వ్రాసినవాక్యం వుక్కిరిబిక్కిరి చేసింది. భయంతో వణికాను. లోలోపల కుమి లాను చేసిన తప్పుకు.'' ఇంకెప్పుడూ చేయను నాన్నా! నన్ను క్షమించు! నేను చదువుకుంటాను!''

పుస్తకం తెరచాను. రామం నన్ను ఆశ్చర్యంగా చూసాడు. ''మగత పోయింది. చదువుకుంటాను'' అన్నాను.

''నాకు నిద్రవస్తోంది'' అన్నాడు రామం ఆవ లిస్తూ. అతని కళ్ళు అలసటను ప్రకటిస్తు న్నాయి.

''నువ్వుకూడా ఒక సోడా తాగిరా!'' అన్నాను.

''ఎందుకటా! పిరికితనం అది. సోడాలవల్ల, టీల వల్ల నిద్రపోతుందా! విల్ పవర్'! కావాలి'' అన్నాడు.

''విల్‌పవర్ కావాలి. నిజం''! అన్నాను. రామం పడుకున్నాడు.

''నేను లేపనా?'' అన్నాను.

''అక్కర్లేదు. పన్నెండు గంటలకు లేస్తాను''.


రామాన్ని ఆశ్చర్యంగా చూసాను. వాడి ఆత్మ స్థైర్యాన్ని మెచ్చుకున్నాను.

''పుస్తకం తెరచి వాక్యాలను పరిశీలిస్తున్నాను! కళ్ళుపని చకచక చేసుకుపోతోంది. చిత్రాంగి!. ఆమె చిత్రంనన్ను కలవరపరచింది. నాలో తుఫాను లేపింది. మూగాను. తొణికిసలాడాను. వెంటనే... నాన్న వ్రాసిన ఉత్తరం!! వళ్ళు ఒకసారి దులుపుకున్నాను. తర్వాత...''విల్ పవర్ కావాలి'' అన్న రామం మాటలు.... అవును. నిజం అను కున్నాను.

బలంగా చిత్రాంగిని బయటకు నెట్టాను. తిరిగి చదువు ప్రారంభించాను. చిత్రాంగి పకపక నవ్వుతూ ఎదురునుంచుంది. ''ఎందుకీ వ్యర్థ ప్రయత్నం!''అన్నట్లుంది ఆ నవ్వు. నాస్థైర్యా నికి సవాలు లావుంది ఆనవ్వు!

లేచాను. చిత్రాంగిని చూచాను. ఆమే ఇంకా అక్కడే ఉన్నది. ఆమెను దగ్గరగావెళ్ళి చూడాలని ఉన్నది. అదేలా సాధ్యం! నామంచి తనానికి ముప్పుకాదా?

నిమిషాలు దొర్లిపోతున్నాయి. చదువు సాగడం లేదు. ప్రతీసెకనూ, చిత్రాంగి కోసం వెచ్చించ బడుతోంది. మనస్సును ఎంత స్వాధీన పరచకుందా మన్నా నేను స్వాధీన పరచుకోలేక పోతున్నాను. ఒక నిశ్చయానికి వచ్చినట్లు నేను చిత్రాంగిని చూస్తాను అనుకొన్నాను. అవును. మనస్సును స్వాధీనపరచుకోలేనప్పుడు, మనస్సును అనుసరించి పోతేనే మంచిది. లేకపోతేసంక్షోభంతప్పితే ప్రయో



కన్యాకుమారి ఎస్.వి.ఆర్.స్వామి.

జనం శూన్యం.

లేచి నుంచున్నాను. చిత్రాంగి ఇంకా అక్కడే ఉంటుంది. చేతివాచీ చూసుకున్నాను. ఇంక ఒక అరగంట మాత్రమే వుంటుంది. తర్వాత వెళ్ళిపోతుంది. ఆమె తెల్లటి గుడ్డలమీద నల్లగా నాగుబాము వంకరలు తిరిగినట్లు మెలికలు తిరిగింది పొడుగాటి జడ. ఆమె అవయవాలు బిగుతుగా అతుకున్నట్లున్నాయి. కొద్దిదూరంలో ఉన్నా ఆమెను భూతద్దంలోంచి చూసినట్లు చూడగలను.

లైటు తగ్గించడానికి వెనక్కు తిరిగితే ఎదురుగా "నాన్నఫోటో!" తప్పుచేసినట్లు, చేస్తున్నట్లు చేయబోతున్నట్లు కుదిలి వణికేను. "తప్పు నాన్నా!" అన్నట్లు ఆయన చూపుల్ని చూడలేక పోయాను. నాన్న నావైపు బాధగా చూస్తున్నాడు.

"నిజంగా దారుణమైన పని తలపెట్టాను నాన్నా!" అని కళ్ళు మూసుకున్నాను. దీపం తగ్గించి మంచంమీద పడుకొన్నాను. రామం విశ్రాంతిగా పడుకున్నట్లు గురకపెడుతున్నాడు. నేనెందుకు పోకూడదు, చదవకపోతే మానె!

చిత్రాంగి బహుశా, ఇంక ఇరువై నిముషాలు వుంటుంది. ఒక్కమాటు చూసివస్తే పోయిందేముంది? ఇలా అనుకుంటుంటే, నాలోని కోర్కె బలంగా విజృంభించింది. దానికి దాసుడనై పోయాను. దీపం పెద్దది చేశాను. రామం నిద్రపోతున్నాడు. వాడిమాటలు గుర్తుకు వచ్చాయి.

"విల్‌పవర్!"

నాకు ఎందుకులేదు ఆత్మస్థైర్యం? రామానికే ఎందుకు ఉండాలి? వెంటనే చిత్రాంగి తెల్లగా నవ్వినట్లు, ఒక్కమాటు దృశ్యమై అదృశ్యమయింది. నాకులేదు ఆత్మస్థైర్యం నిజం! నేను ఆమెకు పూర్తిగా స్వాధీనమై పోయాను. నేను ఆమెను చూడాలి.

ఎదురుగా గోడమీద నాన్న చూస్తున్నాడు. "తప్పు నాన్నా! నువ్వు చేస్తున్నపని వెధవది. నీకు నీవు ద్రోహం చేసుకోకుండా, ఇంటిల్లిపాదికీ కూడా చేస్తున్నావు!" అన్నట్లు అనిపించింది.

చిత్రాంగి ప్రతిమ నన్ను అణువు, అణువునా కప్పివుచ్చింది. "నేను ఏం చేయను నాన్నా. నన్ను క్షమించు" అనుకొన్నాను. నాన్నకు ఎదురాడని నేను ఎదురు చెప్పాను. ఎంత తప్పు చేసాను? చాలా తప్పుచేశాను!

తిరిగి పక్కమీదకు వచ్చిపడుకున్నాను. అవును. నాకు ఒకస్థాయి ఉన్నది. అలంతస్థును నిలబెట్టుకొనే బాధ్యత నాది. నేను ప్రాజ్ఞుణ్ణి ఎవ్వరూ చెప్పనక్కరలేదు. మంచో చెడో. నిర్ణయించుకోవలసింది నేను. ఒకమాటు, తప్పటడుగు వేస్తే యావజ్జీవం బాధ పడవలసింది నేను.

అంతేకాదు....."మంచివాడు" అని నన్ను అంతా అనేవారిని మోసపుచ్చడం సముచితం కాదు.

అదికాదు..... నాచెడు నన్ను ఒక్కణ్ణి మాత్రమేకొట్టదు. అది గొరుచిప్పలా ఇతరులను కూడా బాధిస్తుంది.

ఎదిగిన చెల్లి, చదువుతున్న తమ్ముడు. వంశపు మర్యాద. పరువు గలిగిన తల్లిదండ్రులు—నా స్థితిగతులు..... అన్నీ మంట కలుస్తాయి.

నేను భయంతో కంపించాను. నేను వెళ్ళను వెళ్ళకూడదు. చిత్రాంగిని చూడను. ఆతలంపు నుండి తప్పించుకుంటాను. నేను పూర్తిగా చిత్రాంగిని మరచిపోతాను. నేను నాన్న చెప్పినట్లు చదువుకుంటాను.

ఎదురుగా చిత్రాంగి నవ్వుతూ కనపడింది. "పిరికివాడు" అని అపహాళన చేసింది. ఆమె చూపుల్ని భరించలేకపోయాను. ఆమె సవాలకు ప్రత్యుత్తరం.

ఇవ్వాలనుకున్నాను.

నువ్వంటే నాకు ఇష్టమే... కాని..... నీవు ప్రపంచానికి హీనమైన మనిషివి. నీతో సఖ్యం కూడదు .

చిత్రాంగి నవ్వింది!

పదివాటోతోంది లేచాను. చిత్రాంగి వెళ్ళిపోబోతున్నట్లు చూసాను కిటికీలోంచి. ఒక్కసారి ఆమెను క్రిందిదిగి, చూసిరావాలని బుద్ధి పుట్టింది. నాతో నేను ఎంత అణచిపెట్టుకుందామన్నా, ఆమెను చూడాలన్నకోర్కె బలీయమైంది.

నేను తట్టుకోలేక పోయాను, ఆకోర్కె ఇచ్చె వత్తిడికి.

గబగబ ఏమీ తలంచకుండా మెట్లు అన్నీ దిగాను. సోడాకొట్టు చేరాను. ఆమె ఇంకా అలా నుంచోంది!

సింహాచలం నన్నుచూసి నవ్వాడు. నన్ను, నా భావనను పసిగట్టినట్లుంది! ఒకమాటు కిళ్లీ నమిలాను. ఒకసారి సోడా తాగాను. మరి ఇప్పుడు ఎందుకువచ్చినట్లు ?

"ఏం కావాలి?'

' సిగరెట్టు .

సింహాచలం నన్ను పిచ్చివాడిని చూసినట్లు చూసాడన్నా అందులో తప్పు ఏమీ లేదు. నేను సిగరెట్టు కాల్చగా ఎప్పుడూ చూడలేదు. అతని వాడకంలో ఎప్పుడూ, ఆముక్కరాలేదు.

"మీరు అడుగుతున్నది సిగరెట్!" అన్నాడు.

"ఒవును సిగరెట్ ఇమ్మంటున్నాను .

కిలకిల నవ్వింది చిత్రాంగి. ఆ నవ్వులో నేను ఐక్యమై పోయాను. నాపరిస్థితి మరచాను. ఆమె నావంక చూసింది. దానికి వశుడనై పోయాను.

"ఏం.....సిగరెట్ ఇమ్మంటే అలా చూస్తావేం" అంది చిత్రాంగి.

"కాదు. కాల్చరు."

"ఈవేళ... కాలుస్తారులే!" నవ్వింది పకపక.

"వద్దు బాబూ! ఈ అలవాటు వెధవది..."

"నీతులు బోధించకు. అది నీపొట్టకేమోసం!' అంది ఆమె.

సింహాచలం ఆమె వైపు చూశాడు.

"అవును. నువ్వుచెప్పింది నిజమే..."

"అంతేకాదు సింహీ! నీతులున్నవార్ని నీతుల నుండి తప్పించాలి."

"అవును. మన మందలో కలుపు కోవాలిగా!"

ఆసంభాషణ నాకు అహితవుకలిగించింది. ఆమె ఈమాటలు ఒంటరిగా అంటే నేను భరించగల నేమోగాని, అక్కడ భరించలేను. పైగా, సిగరెట్టును మధ్యపెట్టి దేనినో ఎత్తుకొని మాట్లాడుతున్నారని అర్థంచేసుకో గలిగాను.

"సిగరెట్టు ఇవ్వు!'

"ఇమ్మంటారా? వద్దుబాబూ! నామాట వినండి. వ్యసనం వెధవది. మొదట తీపిగా వున్నా తర్వాత చేదుకొడుతుంది. '

"ఆయనకు తెలియదు పాపం!" పెదిమలు చప్పరించింది. కళ్ళు చికిలించింది. ఆమె మాటలు వికారంగా, బాధగావున్నా ఆమె అవయవ వంపులు, ఆమె కళ్ళ కదలిక ఎంతో అందంగా ఉన్నాయి.

సిగరెట్టు మారుమాటాడక ఇచ్చాడు సింహాచలం. నేను పుచ్చుకొని వచ్చేస్తున్నాను. నావెనకే చిత్రాంగి వస్తోంది. నాభయం ఇంతింత కాదు. నేను చెడిపోతున్నానని నాకు భయంలేదు నాపరువుకై భయం.

వెనకనుండి, నెమ్మదిగా, చిత్రాంగి అన్న మాటలను స్పష్టంగా విన్నాను.

"కొత్తరోడ్డులో ఉంటున్నాను. మీరు రావచ్చు. చెరువు దగ్గరే ఇల్లు."

ఆమె మాటలు వింటూంటే భయంలో కంపించాను. రోమాంచలం అయ్యింది. నాలుక పిడచ కట్టింది. శరీరం అంతా, కరడు కట్టి నట్లయిపోయింది. తెగించి, అనాలోచితంగా,

"అలానే" అన్నాను!

రాత్రి నిద్రలేదు. చాలసేపు ఆలోచించాను. గంటలు దొర్లుతున్నాయి. నేనూ ఎటు తెగింపుకు రాలేదు. ఎందుకు వస్తానన్నాని బాధపడ్డాను. ఎందుకో, ఆమెతో, ఒక్కరాత్రి గడపాలని కాంక్ష ఉన్నా, నేను ధైర్యంగా రాత్రివెళ్ళలేక పోయాను. మనస్సులో శాంతి లేదు.

పన్నెండు గంటలు!

రామం లేచాడు. నేను మేలుకొనే ఉన్నానని చూసి "చదివావ్ అన్నమాట!"

"అవును. లేపుదామనుకున్నాను."

"సంతోషం. నిద్రరాకపోతే ఎందుకు చదుకోకూడదు ?"

"నిద్రరాకకాదు. నిద్రపోలేక. . ."

"నీవేదో మాట్లాడుతున్నావు, అర్థంకాని భాష మాట్లాడేకన్న విసర్జించడం మంచిలక్షణం పడుకుంటావేమో పడుకో రాదూ?"

"నువ్వు చదువుకో!"

తెల్లవారింది! నాకళ్ళు నిద్రలేక, బరువుగా, ఇసుక పడి గరగరలాడుతున్నట్లున్నాయి. రామం కూడా, ఏ రెండుగంటలోతప్ప, రాత్రి అంతా మేల్కొనే ఉన్నాడు. కాని అతని కళ్ళు అలసటను చూపలేదు.

ఆమధ్యాహ్నం. . . నన్ను రామం వేసిన మొదటి ప్రశ్నకు తల్లక్రిందులయ్యాను.

"నువ్వెందుకు మారిపోతున్నావు ?"

ఈ ప్రశ్న నన్ను పూర్తిగా, అయోమయం లోకి ఈడ్చుకు పోయింది. నిదానించుకొని,

"ఏమిటి నీవు అనేది ?"

"సిగరెట్టు కూడా తాగదలచావా ? అంత వ్యసనం అలవాటు చేసుకొని నిద్ర ఆపుకో అక్కర్లేదు. పరీక్ష ప్యాసు, వ్యసనంతో లభించిన దయితే, మామూలుగా పరీక్ష పోవడం కంటె గొప్పగాకాదు. నువ్వుతప్పుపని చేస్తున్నావంటాను. దిగజారి పోతున్నావు. బి. ఎ. చదువుతున్న నీవు నీపరిస్థితిని నీవు తెలుసుకోవాలి!"

"సిగరెట్టు గొడవా ఇది ?" అనుకొన్నాను. స్వేచ్ఛగా గాలి పీల్చుకున్నాను.

"సింహాచలం చెప్పి ఉంటాడు. నిన్న ఆతప్పు పని చేయదలచాను. సిద్ధమయ్యాను. కాని నేను చేస్తున్న పని మంచిది కాదని తెలుసుకున్నాను. అందుకే, నిన్నరాత్రి మానుకోగలిగాను"

"అంటే"

"అవతల వరండామీద చూడు !" అన్నాను. రామం వెళ్ళి చూసాడు. విరచిపారేసిన రెండు సిగరెట్టు ముక్కలను చూచాడు. అతను సంతోషించినట్లు కనపడ్డాడు.

"నీ సంగతి తెలియక అన్నాను. మన్నింపు. సింహాచలం చెప్పింది నమ్మను!"

"నీవే నన్ను మన్నించవలసింది. కానీ ఎందుకో అనిపిస్తోంది. నేను పట్టుతప్పి కాలు జారుతానని, అప్పుడు సహించు ".

"నువ్వు చెప్పేది నాకు అర్థంకాదు. అయినా, నువ్వు ప్రాజ్ఞుడివి. విజ్ఞుడివి. నాకు అన్నీ తెలుసు. తెలిసుండీ చేసేవానిని మన్నించకపోవడ మేమిటి ? తెలివి తక్కువ. నీకు ఏది మంచిదని తోస్తే అది చెయ్యి. ఆత్మబోధను ఎప్పుడూ పాటించు అంతే"

"అదే జరుగదేమో ననిపిస్తోంది. ఒక్కమాట మనస్సు తప్పుతోవను ప్రయాణం చేస్తే, దాన్ని మరల్చడానికిచేసే ప్రయత్నమంతా వ్యర్థమేనేమో! ఒకమాటు తప్పటడుగు వేసిన తరువాత ఇక వేసే అడుగు తప్పటడుగులు అనిపించవేమో !

ఒకటి గుర్తువస్తోంది, సాటన్ అంటాడట. "నాలోని మంచి అంతా పోయాక చెడ్డనే ఆయుధంగా తీసుకుంటానని!"

"నువ్వు చెప్పేదానికి తలా, తోకా వున్నట్లు తోచదు. ఎందుకు కాలం వృధాచేసుకుంటావు ?"

"అవును. చదువుకో రామం ! పరీక్షలు దగ్గర పడుతున్నాయి."

రాత్రి భోజనంచేసి కిళ్ళీకొట్టువైపు చూడకుండా,సరాసరి మేడపైకి వచ్చాను. రామం లేడు. సినిమాకు పోయినట్లుంది. నిసుబుగా వారానికి ఒకరోజు వెడతాడు. రెండవ ఆట ఎలావుంటుందో వాడి జన్మలో తెలియదు. అంత బుద్ధిమంతుడు. ఎందుకో ... అంత బుద్ధిమంతతనం కూడా చిరాకే ! చాదస్తుడు.

నేను పుస్తకం తీసి ఉపక్రమిస్తూంటే, నేను ఈయేడు పరీక్ష ప్యాసుకానేమో ననుకున్నాను. రోజూ కిళ్ళీ వేసుకునేవాడిని. ఈ వేళ ఎందుకు వేసుకోలేదు. చిత్రాంగిని చూడవలసి వస్తూందనా ? కాదు ... చిత్రాంగి అంటే యిప్పుడు భయం. సిగ్గు. నిన్నరాత్రి జరిగిన విషయమంతా ఒకటొకటిగా ఆలోచిస్తూ కూర్చుండిపోయాను. ఈలోగా ఎవ్వరో మెట్లెక్కుతున్నచప్పుడు.గాజుల చప్పుడు ! చిత్రాంగి కాదుకదా! ఒక్కమాటు దారుణంగా నా శరీరం అంతా ఉష్ణమయం అయి పోయింది. ఉష్ణంతో సెగలు, పొగలు కక్కుతున్నట్లు అనిపించింది.

"చిత్రాంగి !"

చిత్రాంగి వచ్చి ఏమీ మాట్లాడలేదు. నన్ను చూసి నవ్వింది. కవ్వం క్రింద మజ్జిగ తెలియాడుతున్నట్లుంది. ఆ నవ్వులో, నా భయం, సిగ్గు అన్నీ పోయాయి. ఆమె లే గులాబీ చీరెలో వెలిగి పోతున్నది. ఫాలభాగం విశాలంగా, అక్కడక్కడ మరకల్లా ముంగురులతో ఎంతో అందంగా ఉంది. నిండుగా నిగారించిన ఎరుపైన నునుపు బుగ్గలు

నన్ను కవ్విస్తున్నాయి. పరువుకొచ్చిన అరిటిగెలతో ఉన్న అరిటిచెట్టులా ఉంది ఆమె. ఆమె అందం, చందం, తీరు, ఏకాంతం, నాలోని కాంక్ష, నన్ను ఉక్కిరి బిక్కిరి చేసినాయి. నేను ఆమెను సమీపించి, పొదివిపట్టి చుంబించాను. ఆమె ఏదో మాట్లాడబోయింది. ఆమె నోటిని మూసాను. ఆమె మూగదయితే ఎంత బాగుండును ! ఆమె నన్ను లెక్కచేయలేదు.

''నిన్న రాలేదేం ?' అంది చిత్రాంగి, యాస ఉచ్చారణ, గరకు శబ్దం.

''ఖూరికేనే !''

''పిరికివారు ...''

''కాదు ...''

''మరి ...''

''ఈ రాత్రి ...''

''తప్పక ...''

ఆమె దిగి వెళ్ళిపోయింది. ఆమె దిగి వెళ్ళిపోయిందో లేదో, రామం పైకి వచ్చాడు. నన్ను చీడ పురుగును, అసహ్యమయిన పదార్థాన్నీ చూసినటు చూసాడు.

''నీ బి. ఏ.'' తెలివి యిదా ! ఇందుకా కాలేజీ చదువు ? వెధవ సన్యాసి !''

''రామం !'' కోపం వచ్చింది నాకు.

''ఛీ! నీకు ఉత్సాహము లేదు. నీచం లేదు. పరువు లేదు. మర్యాద, లేదు. నీవు పిచ్చికుక్కవి. ఏదో మంచివాడివి, బుద్ధిమంతుడవు అనుకున్నాను. అందుకే నీకు చోటు యిస్తా. తెల్లవారేసరికి పో! లేదా నే ఖాళీచేయవలసి వుంటుంది.''

''అలానే!''

''ఎందుకు ! నీ తెలివి అంతా ఏమయింది ? నీ బుద్ధి గడ్డి తిందా ! ఆమె పెద్ద రంభ అనుకున్నావా ? కుళ్ళుబొంత ! ఇంత నైచ్యానికి వడిగడతావని నేను ఎప్పుడూ అనుకోలేదు.''

''నన్ను ఏం చెయ్యమంటావు ?''

''జరిగిందేదో జరిగిపోయింది. ఇకనైనా బుద్ధిగా ఉండు.''

''ఏమీ జరుగలేదు ... కానీ, నీవు చెప్పినట్లు జరుగలేదేమో కూడా !''

''ఇంత పశువ్వని నేను ఏనాడూ అనుకోలేకపోవడం నా తెలివి తక్కువే. నీ పరువు, చదువు, మర్యాదా, నీ తల్లిదండ్రులూ, ఇవన్నీ దృష్టిలో పెట్టుకో. కనీసం ... అవేవీ అక్కరలేకపోయినా నీ కోసమే నీవు బుద్ధిగా ఉండాలి.''

''నీకు తెలియదు రామం. నన్ను వదుకోనీ.''

తెల్లవారగానే నేను ఖాళీ చేస్తాను. నువ్వు చదువుకో !''

రామం మాట్లాడక తను చదువుకో సాగాడు. రాత్రి పన్నెండయింది. నేను లేచాను. చొక్కా తొడుక్కొని ఆ నిశిలో రోడ్డుమీద పడ్డాను. ఎవ్వరూ నా మనస్సులో లేరు. ఒక్క చిత్రాంగి తప్పితే. కొత్తరోడ్డు వంపు తిరిగాను. ఇదుగో చెరువుకట్ట. ఇదే మొదటి ఇల్లు. చిత్రాంగిది.

తలుపు బిగించి ఉంది. ''మోసకత్తె'' అనుకున్నాను. నిన్న జరిగినదానికి ప్రతీకారం చేసిందన్నమాట. లేక నన్ను నమ్మలేదో ! కిటికీ తలుపులు తెరచే ఉన్నాయి. తొంగిచూసాను. నా కళ్ళు మసకక్రమ్మాయి. చిత్రాంగి కాదు, అది మాలిన్యపు ముద్ద. చిత్రాంగి ఎవ్వడి కవుగిలిలోనో యిరుక్కుపోయింది. నన్ను చూసింది. ఆ కవుగిలిలోవుండే నవ్వుతూ ''పంతులూ'' అంది.

''ఛీ!'' అనుకున్నాను.


''ఇద్దరూ వచ్చారూ ?'' అన్నాడు.

''సింహాచలం ! ఛీ! ఇద్దరా?'' అని వెనక్కు తిరిగాను. ''రామం!!'' అప్పుడు నాలో ఏర్పడిన తుఫాను కల్లోలం, ప్రళయం చెప్పలేను! రామాన్ని వెంటనే జొరకపుచ్చుకుని, వెనుక్కు వచ్చాను. రామం నన్ను మన్నించాడు తర్వాత.

సింహాచలం నన్ను చూసేకాక, రామాన్ని చూసికూడా అదోలా నవ్వుతాడు. నాకు నేను మసి పులుముకోవడమేకాక, ఇంతమసి రామానికి కూడా

చిత్రాంగి, ఇంకా అక్కడే ఉందని, తెలిసినా, నేను చూడను. చూసినా భయం లేదు.

ఒకటి ... నీచుని మంచివానిగా త్రిప్పడానికి మంచితనాన్ని కాక, నైచ్యపు ముద్దను చూపిస్తే అతనిలో మార్పు రావచ్చు ★



వారణాసి